సాక్షి
నిజామాబాద్
సోమవారం। 11 । సెప్టెంబర్ । 2023



అక్బర్‌నగర్‌లో కేంద్రబృందం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర అధికారుల బృందం అక్బర్‌నగర్‌లో పర్యటించింది.

- 8లో ▸



ఎస్సారెస్పీకి ఢోకా లేనట్లే..!

ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి వరద వస్తుండడంతో రెండు పంటలకు నీటికి ఢోకా లేనట్లేనని రైతులు భావిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.4 /23.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

బీజేపీ అర్బన్ నుంచి మాదాసు దరఖాస్తు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే టికెట్ కోసం ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాదాసు స్వామియాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఆయన అనుచరులతో కలిసి హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందించారు. ప్రస్తుతం పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. నిజామాబాద్ ఛాయ్‌వాలాగా మాదాసు స్వామియాదవ్‌కు పేరుంది. ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేస్తున్న మాదాసు 1988 నుంచి ఏబీవీపీలో పనిచేస్తూ వచ్చారు. తర్వాత 2016 నుంచి 2021 వరకు నగర పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత నుంచి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగానూ వ్యవహరిస్తున్నారు. దరఖాస్తు సమర్పణ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ రాగి నారాయణయాదవ్, కిసాన్‌మోర్చా జిల్లా నాయకుడు ఆదె నరేందర్ ఉన్నారు.

యెండల సుధాకర్..

సుభాష్‌నగర్ : నిజామాబాద్ అర్బన్ బీజేపీ టికెట్ కోసం ఆ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు యెండల సుధాకర్ ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ రాగి నారాయణ యాదవ్, నరేందర్, నాగరాజ్, దుబాయ్ శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీల్లో జిల్లా నేతలకు చోటు



ఈరవత్రి అనిల్ | గడుగు గంగాధర్ | తాహెర్ బిన్ హందాన్

ఖలీల్‌వాడి : ఏఐసీసీ ప్రకటించిన ఎన్నికల కమిటీల్లో జిల్లాకు సంబంధించిన నాయకులకు చోటు దక్కింది. ఇందులో భాగంగా పబ్లిసిటీ కమిటీ, వైస్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్, సభ్యులుగా గడుగు గంగాధర్‌ను నియమించారు. అదేవిధంగా మేనిఫెస్టో కమిటీ సభ్యులుగా తాహెర్ బిన్ హందాన్, చార్జిషీట్ కమిటీ మెంబర్లుగా అన్వేశ్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు.


280 మందికి కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం 280 మంది ఐసెట్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు కౌన్సిలర్ కన్వీనర్ శ్రీరాం కుమార్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన చేసిన అనంతరం కళాశాలల ఎంపిక చేసుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీ వరకు ఈ సదుపాయం ఉందన్నారు.

నిజాంసాగర్‌లోకి 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 6 వేల క్యూ సెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ఒక గేటు ద్వారా అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీ)తో నిండుకుండలా ఉంది.

దోపిడీ వైద్యం



జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలాయి. చాలా మంది జ్వరాలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆస్పత్రుల నిర్వాహకులు అధిక మొత్తంలో ఫీజులతో పాటు డెంగీ పేరుతో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసి రోగుల వద్ద రూ. వేలల్లో వసూలు చేస్తున్నారు.

- రోగులను పిండేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- అయితే వైరల్..లేకుంటే డెంగీ
- జ్వరమని వెళ్తే లేనిపోని ఆరోగ్య పరీక్షలు
- చికిత్స, మందుల కోసం రూ.వేలల్లో వసూలు
- ఎన్‌ఎస్–1 టెస్ట్‌తో పాజిటివ్‌గా నిర్ధారించి చికిత్సలు

నిజామాబాద్‌నాగారం : వర్షాకాలంలో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జ్వరాలబారిన పడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవలే కళ్లకలకతో ప్రతి ఇంట్లో ఇబ్బందులు పడ్డారు. అయితే వైరల్ ఫీవర్లే ఎక్కువగా జిల్లాలో వ్యాప్తి చెందాయి. అయితే జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ బూచి చూపుతూ అడ్డగోలుగా రోగుల నుంచి దోచుకుంటున్నారు. జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే చాలు వెంటనే వివిధ రకాల టెస్టులు రాస్తూ వైరల్ లేకపోతే డెంగీ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ రోగులను అడ్మిట్ చేసుకుని వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లాలో డెంగీ కేసులు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా 117 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో ప్రస్తుత తేదీ వరకు మరో 39 కేసులు నమోదయ్యాయి మొత్తంగా ఇటీవలి కాలంలో మొత్తంగా 156 వరకు డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన కేసులు మాత్రమే. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒక్క కేసు నమోదైనట్లు అధికారుల వద్ద లెక్క లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

పర్యవేక్షణాలోపం..

జ్వరం వస్తే చాలు ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకుని అనంతరం డెంగీ టెస్టుల పేరుతో ఒక్కోరోగి వద్ద నుంచి రూ. 60 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రతిరోజు ఒక్కో ఆస్పత్రిలో 40 నుంచి 80 మందికి పైగా రోగులు జ్వరంతో చూపించుకోవడానికి వస్తున్నారు. ఇందులో రోజుకు 6 నుంచి 10 మందిని అడ్మిట్ చేసుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు సంబంధించి ల్యాబ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌ఎస్–1 టెస్టులు చేసి డెంగీ అని చెప్పి అడ్మిట్ చేసుకుంటున్నారు. అయినా సంబంధిత వైద్యారోగ్య శాఖాధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదని రోగుల బంధువులు ఆవేదన చెందుతున్నారు.

అడ్మిట్ అయ్యాకే..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ దోపిడీ జరుగుతోంది. ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలతో థైరాయిడ్, డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర టెస్టులు చేసి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. డెంగీ కోసం ప్రత్యేకంగా ఎన్ ఎస్–1, ఎలీసా టెస్టులు రెండు చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం కేవలం ఎన్‌ఎస్–1 టెస్టు చేసి డెంగీ అని చెప్పి రోగులను అడ్మిట్ చేసుకుంటున్నారు. అలాగే కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రుల్లో అనుమతి లేకున్నా ఎలీసా టెస్టులు చేసి రిపోర్టులు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎలీసా టెస్టులు చేయాలి. డెంగీ రాకున్నా వచ్చినట్లు చూపించేసి ప్లేట్‌లెట్స్ (రక్తకణాలు) తగ్గిపోయాయని రోగులను భయభ్రాంతులకు గురిచేసి ఆస్పత్రిలో చేర్చుకుంటున్నారు. ఇలా ఒక్కో పేషెంట్‌ను నాలుగు రోజుల నుంచి ఆరు రోజుల వరకు అడ్మిట్ చేసుకుని ఒక్కొక్కరి వద్ద రూ. 60 వేలకు పైగా వసూలు చేస్తున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు

ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లలో డెంగీకు సంబంధించి ఎన్‌ఎస్–1 టెస్టులు చేసి డెంగీ అని నిర్ధారించరాదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎలీసా టెస్టులో డెంగీ అని వస్తేనే డెంగీ ఉన్నట్లు. అంతేకాని ఇష్టారాజ్యంగా టెస్టులు చేసి అడ్మిట్ చేసుకోవద్దు. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో

కళాశాలల్లో గుర్తింపు తనిఖీలు

నేటి నుంచి ప్రారంభం

- ప్రిన్సిపాళ్లు, సిబ్బంది విషయంలో గందరగోళం
- కనీస సౌకర్యాలు లేని విద్యాసంస్థలపై చర్యలకు సిద్ధం..?

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలల అనుబంధ గుర్తింపు తనిఖీలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. అయితే ఈసారి తనిఖీలు కొంత పకడ్బందీ గా జరుగనున్నాయని రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలను బట్టి తెలుస్తోంది. ఇటీవలే అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ వెంటనే వివిధ కళాశాలలు వర్సిటీకి చెల్లించాల్సిన బకాయిలపై ముందుగా దృష్టి సారించారు. అప్పటికే కళాశాలలు వర్సిటీకి దాదాపు రూ. 30 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తించారు. వెంటనే అనుబంధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిర్ణీత గడువులోగా ఫీజు బకాయిలు చెల్లించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిక చేశారు. దెబ్బకు దిగివచ్చిన కళాశాలల యాజమాన్యాలు (ఒకటి రెండు మినహా) తమ బకాయిలు చెల్లించారు.



కళాశాలల నిర్లక్ష్యం..

యూనివర్సిటీ ఆమోదం పొందిన ప్రిన్సిపాళ్లు లేని అనుబంధ కళాశాలలకు ఈసారి గుర్తింపు ఇస్తారా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ప్రిన్సిపాళ్లు, సిబ్బంది వర్సిటీ ఆమోదం పొందాలని వర్సిటీ ఉన్నతాధికారులు పలుమార్లు కళాశాలల యాజమాన్యాలకు సమచారం ఇచ్చారు. అయితే కొందరు యాజమానులు వర్సిటీ అధికారుల సూచనలు, హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యూజీసీ గైడ్‌లైన్స్ మేరకు 28 నిబంధనలు అమలు చేయాల్సి ఉంటుంది. యూజీసీ, యూనివర్సిటీ నిబంధనల మేరకు కనీస వసతులు లేకుండా, ఆమోదం లేని ప్రిన్సిపాల్, సిబ్బంది కొనసాగుతున్న కళాశాలలపై చర్యలు తీసుకునేందుకు ఆడిట్‌సెల్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

అర్హులైన ప్రిన్సిపాళ్లు లేరు..

వర్సిటీ పరిధిలోని పలు అనుబంధ కళాశాలల్లో ఎంత మంది సిబ్బంది వర్సిటీ గుర్తింపునకు లోబడి పని చేస్తున్నారనే విషయంలో స్పష్టత లేదు. చాలా వరకు కళాశాలలకు అర్హత పొందిన ప్రిన్సిపాళ్లు లేరు. దాదాపు పదేళ్లగా సిబ్బంది రెన్యూవల్స్ లేకపోవడం, కరోనా సమయంలో వర్సిటీ ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించి అనుబంధ గుర్తింపు మంజూరు చేయడం జరిగింది. ఇక ఇప్పుడు పూర్తిస్థాయి పకడ్బందీ తనిఖీలకు వర్సిటీ అధికారులు సిద్ధమవుతున్నారు.

తనిఖీలు ప్రారంభిస్తాం..



యూజీసీ, యూనివర్సిటీ నిబంధనల మేరకు డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలల్లో కనీస వసతి సౌకర్యాలు ఉండాలి. వర్సిటీ ఆమోదం పొందిన ప్రిన్సిపాల్, సిబ్బంది లేకపోతే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించేందుకు, కనీస సౌకర్యాలు మెరుగుపర్చుకునేందుకు కళాశాలల యాజమాన్యాలకు రెండు నెలల గడువు ఇచ్చాం. సోమవారం నుంచి అనుబంధ గుర్తింపు కోసం కళాశాలలు తనిఖీలు ప్రారంభిస్తాం. అవసరమైతే నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దుచేసి వాటిపై చర్యలు తీసుకుంటాం.

– ఘంటా చంద్రశేఖర్, ఆడిట్‌సెల్ డైరెక్టర్, తెయూ

ఇందూరుపై ముసురు

- ఇబ్బందులు పడ్డ ప్రజలు
- మరో రెండ్రోజులు జిల్లాపై తుఫాను ప్రభావం

నిజామాబాద్ రూరల్ : జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి ముసురు కమ్ముకుంది. చిన్నగా కురుస్తున్న వర్షంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురవగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ముసురుపట్టే ఉంది. చిరువ్యాపారస్తులు తమ దుకాణాలను మూసి ఉంచారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో వారం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆరుతడి పంటలైన, సోయా, మొక్కజొన్న, కంది, పెసర, మినుములను పండించే రైతన్నలకు ఈ వర్షం తీవ్ర నష్టం చేకుర్చింది. మరో రెండుమూడు రోజులు కూడా ముసురు పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు పేర్కొంటున్నారు. మొరం కంకర రోడ్లు ఈ వర్షానికి చిత్తడిగా మారాయి.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్లు

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ప్రారంభం

నిజామాబాద్‌నాగారం : మారుమూల గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్లు, కల్వర్టులు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించామని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో నూతనంగా నెలకొల్పిన చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ పునర్వ్యవస్థీకరణలో మరిన్ని కొత్త పోస్టులు వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చొరవ చూపాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు మంత్రి హితవు పలికారు. స్థానికంగా చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఏర్పాటు కావడంతో వివిధ పనుల కోసం హైదరాబాదుకు వెళ్లే అవసరం లేకుండా పోయిందన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి సీతారాములుకు, అధికారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ సత్యనారాయణ, ఇంజినీరింగ్ అధికారులు భావన్నా, ప్రభాకర్, రాజేశ్వర్, శంకర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

ఎవుసం తెలియనోడూ మాట్లాడుతున్నాడు..

బాల్కొండ : ఎద్దు, ఎవుసం గురించి తెలియని వ్యక్తులు కూడా వ్యవసాయం గురించి మాట్లాడుతున్నారని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం బాల్కొండ మండలం బస్సాపూర్‌లో అభివృద్ధి పనులు, ముప్కాల్ మండలం నల్లూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేశారు. పొరపాటున రేవంత్‌రెడ్డి సీఎం అయితే రైతులకు మూడు గంటలే కరెంట్ ఇస్తారన్నారు. రైతు బాధలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు లావణ్య, సామ పద్మ, జెడ్పీటీసీ సభ్యులు దాసరి లావణ్య, బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీలు శ్రీకాంత్, ఆకుల చిన్నరాజన్న, సర్పంచ్‌లు కల్యాణి, జక్కుల సువర్ణ, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, సత్యనారయణ, పార్టీ మండల అధ్యక్షులు బద్దం ప్రవీన్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కలైన తెలంగాణ చరిత్రను వెలికితీయాలి

- ప్రముఖ వక్త రాకా సుధాకర్
- స్వాతంత్య్ర సమరయోధుడు రుక్మారెడ్డి ఆత్మకథ పుస్తకావిష్కరణ

నిజామాబాద్ సిటీ : దేశానికి స్వాతంత్య్రం వచ్చిన అనంతరం ముక్కలైన తెలంగాణ చరిత్రను వెలికి తీయాలని ప్రఖ్యాత చరిత్ర పరిశోధకుడు, సీనియర్ పాత్రికేయుడు రాకా సుధాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్‌భవన్‌లో ఇతిహాస సంకలన సమితి(ఇందూరు) ఆధ్వర్యంలో 'తెలంగాణ విమోచన దినం వాస్తవ చరిత్ర'పై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాకా సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత స్వాతంత్య్ర పోరాటానికి మిగితా భారత స్వాతంత్య్ర పోరాటానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. దేశానికి 1947 ఆగస్టులో స్వాతంత్య్రం వస్తే తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న రజాకార్ల నుంచి విముక్తి లభించిందన్నారు. రజాకార్ల తెలంగాణకు స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన తర్వాత పాలకులు సంబురాలు చేయాల్సింది కాని ఈ సందర్భాన్ని రాజకీయం చేసి వాస్తవిక పరిస్థితిని మరుగున పడేసే ప్రయత్నం జరిగిందన్నారు. హైదరాబాద్ సంస్థాన్‌లో ఉన్న 9 జిల్లాల చరిత్రను ముగ్గురు రావులైన కమ్యూనిస్ట్ రావు, రజాకర్‌రావు, రాజకీయ లబ్ది చేకూర్చే రావు పట్టిపీడిస్తున్నారన్నారు. ఈ చరిత్రను మనం దాచిపెట్టి భావితరాలకు అందించకపోతే ఎంతో నష్టపోతామన్నారు. తెలంగాణ చరిత్రను మూడుముక్కలు చేసి చూడటం ప్రారంభిస్తే చాలా దురదృష్టకరమైన పరిస్థితి వస్తుందన్నారు. గతంలో గ్రామాల్లో సామాన్య ప్రజలు నిజాం పాలకుల అకృత్యాల నుంచి తమను తాము రక్షించుకునేందుకు గ్రామ శివారులో బురుజులను ఉపయోగించుకునేవారు. నిజాం పాలకులపై సామాన్యులు చేసిన పోరాటాల కథలు చెప్పుకునేందుకు ఈ బురుజులు ఉపయోగపడ్డాయన్నారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సదస్సులో ఆహూతుల మధ్య చర్చ జరిగింది. ఇందూరు వీరుల గురించి సమగ్ర కథనం 'సాక్షి'లో ప్రచురితమవడంపై సభికులు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న రాకా సుధాకర్



ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాకా సుధాకర్, తదితరులు



నల్ల రుక్మారెడ్డి ఆత్మకథ పుస్తకంలో 2వ పేజీలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్

ఆత్మకథ పుస్తక ఆవిష్కరణ

స్వాతంత్య్ర సమరయోధుడు, నిజామాబాద్ ప్రథమ మున్సిపల్ చైర్మన్ నల్ల రుక్మారెడ్డి స్వయంగా రాసుకున్న నా ఆత్మకథ పుస్తకాన్ని కార్యక్రమంలో రాకా సుధాకర్, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు, రుక్మారెడ్డి మనుమడు వ్యాపారవేత్త నల్ల దినేష్‌రెడ్డి, మోహన్‌దాస్ ఆవిష్కరించారు.

అయోమయంలో గెజిటెడ్ హెచ్‌ఎంలు

- పదోన్నతి వస్తే జిల్లా దాటాల్సిందే..
- జిల్లాలో 103 మంది పదోన్నతికి అర్హులు
- నాట్ విల్లింగ్ సదుపాయం కోసం ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

నిజామాబాద్‌అర్బన్ : ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాగంగా కొందరు జోన్ దాటి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్, గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించనుంది. గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టు జోన్‌కు సంబంధించి కావడంతో పదోన్నతి లభిస్తే జోన్‌లో ఏ జిల్లాకైనా వెళ్లాల్సి ఉంటుంది. దీనిపై కొందరు హెచ్‌ఎంలు ఆసక్తి చూపడం లేదు. జిల్లా దాటి వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. ముఖ్యంగా మహిళలు మాత్రం పదోన్నతి వదులుకోవడానికైనా సిద్ధమవుతున్నారని, జిల్లా దాటి వెళ్లడానికి ఇష్టపడడం లేదని సమాచారం.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి 4,088 మంది దరఖాస్తులు చేసుకున్నారు. పదోన్నతుల్లో భాగంగా జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎంకు సంబంధించి 103 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కాని పదోన్నతి కోసం అర్హులైన వారు 200 మంది ఉన్నారు. మల్టీజోన్ పరిధిలో 1,111 ఖాళీలు పదోన్నతులకు కేటాయించారు. ఇందులో 1:2 ప్రకారం పదోన్నతి చేపట్టాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో పదోన్నతిపై వెళ్లేవారు ఉంటారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చేవారు కూడా ఉన్నారు. కాని పదోన్నతి వదులుకంటే మాత్రం సంబంధిత పోస్టు ఖాళీగా ఉంటుంది. జిల్లాలో చాలా మంది పదోన్నతి వచ్చినా ఇతర జిల్లాలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీంతో మళ్లీ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. అందుకే ఉపాధ్యాయ సంఘాలు నాట్‌విల్లింగ్ అవకాశం కల్పించా లని డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా పదోన్నతి వదులుకుంటే అతని తర్వాతి స్థానంలో ఉన్నవారికి అవకాశం కల్పిస్తే పోస్టు ఖాళీగా ఉండదని, మరొకరికి పదోన్నతి అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

ప్రక్రియ షురూ..

జిల్లాలో 1,192 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 4,752 మంది టీచర్లు ఉన్నారు. ప్రస్తుతం బదిలీలు, పదోన్నతుల కోసం 4,088 మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో హెచ్‌ఎంలుగా 103 మంది పదోన్నతి ఉండగా ఇందులో ప్రభుత్వ విభాగంలో 13 మంది, లోకల్ బాడీ విభాగంలో 90 మంది ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందేవారు 260 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం అభ్యంతరాల స్వీకరణ జరుగుతోంది. కాగా టీచర్ల సంఘం నాయకులు మాత్రం కౌన్సెలింగ్‌ను మ్యాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న కౌన్సెలింగ్ ఆన్‌లైన్‌లో జరుగుతోంది. విద్యాశాఖ సెక్రెటరీ దేవసేన ఆధ్వర్యంలో ప్రతి జిల్లాల వారీగా పరిశీలన జరుగుతుంది. దీనిపై సంఘల వారు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.



డీఈవో ఆఫీస్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది(ఫైల్)

స్పష్టత కోసం డిమాండ్..

పదోన్నతులకు సంబంధించి జీ.వో 317 కింద వచ్చిన టీచర్ల వివరాల్లో స్పష్టత లేదు. పాయింట్ల కేటయింపుల్లో కూడా తేడా ఉంది. సీనియారిటీ లిస్టులో 1 పాయింట్ వచ్చిన వారికి వారి పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘలు డిమాండ్ చేస్తున్నాయి. కాని అధికారులు మాత్రం వారి డీఎస్సీ ర్యాంక్‌ను పరిగణలోకి తీసుకుంటున్నారు. అలాగే ఉర్దూ మీడియంలో కొందరు టీచర్లు కావాలనే తక్కువ పాయింట్లు వేసుకుంటున్నారు. దీనిపై జిల్లా స్థాయిలో పరిశీలన చేయడం లేదు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జిల్లాస్థాయిలో కమిటీ ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలి..



పదోన్నతులకు సంబంధించి నాట్ విల్లింగ్ సదుపాయం కల్పించాలి. దీంతో మరొకరికి అవకాశం లభిస్తుంది. లేదంటే పదోన్నతి వదులుకుంటే పోస్టు ఖాళీగా ఉంటుంది. అధికారులు దీనిపై నిర్ణయం తీసుకోవాలి.

– మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

వదులుకుంటే అవకాశమివ్వొద్దు



పదోన్నతి తిరస్కరించిన టీచర్‌కు వచ్చే పదోన్నతిలో అవకాశం ఇవ్వరాదు. కాని పదోన్నతి తిరస్కరించిన వెంటనే నాట్‌విల్లింగ్ సదుపాయం కల్పించి ఇతరులకు అవకాశం కల్పించాలి. దీంతో టీచర్లందరికీ న్యాయం జరుగుతుంది.

– వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎస్సారెస్పీకి వరద ఢోకా లేనట్లే..!

- ఐదేళ్లుగా వందల టీఎంసీల వరద
- రెండు పంటలకు అందుతున్న నీరు
- మిగులుజలాలు గోదావరిలోకి


నిండుకుండలా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఢోకా లేనట్లే కనిపిస్తోంది. గడిచిన ఐదు సంవత్సరాలుగా వందల టీఎంసీల వరద ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో రెండు పంటలకు సకాలంలో నీరు అందడంతో పాటు, వందల టీఎంసీల నీరు జూలై, ఆగస్టు నెలల్లోనే అధికంగా గోదావరిలోకి వస్తోంది. కానీ అంతకు ముందు ప్రాజెక్ట్‌లోకి వరదలు కొంచెం ఆలస్యంగా వచ్చి చేరినట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఎస్సారెస్పీకి ప్రధాన వరద మహారాష్ట్రలోని గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోనే అధికంగా వరద వచ్చి చేరుతోంది. మంజీరా, నిజాంసాగర్, సింగీతం ప్రాజెక్టుల నుంచి ఎస్సారెస్పీలోకి వరద వస్తోంది.

ఎగువ నుంచి..

మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ ఎగువ భాగాన బాబ్లీ ప్రాజెక్ట్‌ను నిర్మించింది. ఈ నిర్మాణంతో ప్రాజెక్ట్‌లోకి వరద అంతగా రాలేదు. దీంతో అక్రమ నిర్మాణంపై ప్రశ్నించేందుకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం అనేకమార్లు పోరాటాలు చేసింది. ఎట్టకేలకు 2013లో దేశ అత్యున్నత స్థానం జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తి అక్టోబర్ 28న మూసి ఉంచాలని తీర్పు చెప్పింది. నాటి నుంచి తీర్పు ప్రకారం గేట్లను మహారాష్ట్ర అధికారులు ఎత్తుతున్నారు. కానీ ముందస్తుగా వరద వస్తే ముందే గేట్లను ఎత్తేస్తున్నారు. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి అధిక వరద వచ్చి చేరుతోంది.

రెండు సార్లు వరద కష్టాలు

ప్రాజెక్టు నిర్మాణ కాలం నుంచి 1987, 2015 సంవత్సరాల్లో ఎస్సారెస్పీకి వరద వచ్చి చేరలేదు. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం డెడ్ స్టోరేజీ 5 టీఎంసీల కంటే తక్కువకు పడిపోయింది. ఆ రెండు సంవత్సరాలు ఆయకట్టుకు కూడా నీటి సరఫరా చేపట్టలేదు. 1983లో అత్యధికంగా 1300 టీఎంసీల కంటే ఎక్కువ వరద వచ్చి చేరింది. కనిష్టంగా 2015లో 1.67 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది.

సంవత్సరం	ఇన్‌ఫ్లో (టీఎంసీలు)	ఔట్‌ఫ్లో(టీఎంసీలు)
2019	168.12	57.768
2020	371.90	231.15
2021	682.1	546.68
2022	595.25	438.31
2023	155.12(ఇప్పటి వరకు)	56 (ఇప్పటి వరకు)

మిగులు జలాలు గోదావరిపాలు..

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చి చేరుతుండడంతో జూలై నుంచే మిగులు జలాలను గోదావరిలోకి వదులుతున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి నిరంతరం వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. గడిచిన ఐదేళ్లలో 1258 టీఎంసీల నీరు గోదావరి పాలైంది.

క్లుప్తంగా

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా ప్రభాకర్‌రెడ్డి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గంగామోహన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవీన్, కోచ్ కృష్ణ, జైపాల్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

వర్ని(చందూర్): మండలంలోని లక్ష్మాపూర్‌లో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు వరి పంటలను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. కాండం తొలుచు పురుగు, బ్యాక్టీరియా, ఎండాకు తెగులు, సుడిదోమ వ్యాప్తి వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

అంతాపూర్‌లో కొండచిలువ హతం



వర్ని: మండలంలోని అంతాపూర్ పొట్టిగుట్ట గ్రామాల మధ్య వ్యవసాయ పొలాల్లో ఉన్న కొండచిలువను రైతులు ఆదివారం చంపేశారు. సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ పొలాల్లో కనిపించడంతో రైతులు కర్రలతో కొట్టి హతం చేశారు. ప్రజలకు, పశువులకు ప్రాణహాని కలిగిస్తుందన్న భయంతో చంపేసినట్లు స్థానికులు తెలిపారు.

బీజేపీ టికెట్‌కు దరఖాస్తులు



బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ బోధన్ టికెట్ కోసం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్ ఆదివారం దరఖాస్తులు అందజేశారు. వారి వెంట జిల్లా అధికార ప్రతినిధి కరణ్ రెడ్డి, మండలాల అధ్యక్షులు మనోహర్, నవీన్, ఇంద్రకరణ్, ప్రవీణ్, గోపీకృష్ణ, జడ్పీటీసీ మేక విజయసంతోష్, ప్రచార కార్యదర్శి వాసు తదితరులు ఉన్నారు.

70 అభ్యంతరాలు స్వీకరణ

నిజామాబాద్ అర్బన్ : టీచర్ల బదిలీలకు సంబంధించి ఆదివారం రాత్రి వరకు 70 అభ్యంతరాలు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలు తీసుకుంటున్నారు. వీటిపై నేడు (సోమవారం) పరిశీలన చేయనున్నారు. అనంతరం తుది జాబితా వెలువడనుంది.

తెలంగాణ వీరవనిత 'చాకలి ఐలమ్మ'


బాన్సువాడలో నివాళులర్పిస్తున్న స్పీకర్ పోచారం


కామారెడ్డిలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

బాన్సువాడ: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం బాన్సువాడలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన మహాయోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు పుష్పారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, గురువినయ్, శ్రీధర్, గంగుల గంగారాం, రజక సంఘం నాయకులు మ్యాపర్ సాయిలు, బోనం సాయిలు, బస్వయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: తెలంగాణ ధీర వనిత చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆదివారం అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం



మాయావార్ రాజేశ్వర్ వింజమూరి సుధాకర్

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర వినియోగదారుల సమాచార కేంద్రం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా మాయావార్ రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని రాఘవ రత్న టవర్స్ అబిడ్స్‌లోని ఆలిండియా మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాయావార్ రాజేశ్వర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శిగా వింజమూరి సుధాకర్(మహబూబాబాద్), ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ రతన్‌సింగ్(హనుమకొండ), కార్యనిర్వహణ కార్యదర్శిగా బాల లింగయ్య(మహబూబ్‌నగర్), సహాయకార్యదర్శిగా వెంకటేశ్వర్లు(సూర్యపేట), కోశాధికారిగా గురువయ్య(నల్గొండ), రీజనల్ సెక్రటరీగా సుదర్శన్‌గౌడ్(వరంగల్)తో పాటు కార్యవర్గసభ్యులుగా వెంకటేశ్, దీక్షితులు, మధు, సువర్ణ, తిరుపతయ్య, రామకృష్ణ ఎన్నికయ్యారు.

అక్బర్‌నగర్‌లో కేంద్ర బృందం పర్యటన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీఆర్డీవో


పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామాన్ని కేంద్ర అధికారుల బృందం ఆదివారం పర్యటించింది. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను డీఆర్డీవో చందర్‌నాయక్ కేంద్ర అధికారులకు వివరించారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, పల్లె దవాఖానను పరిశీలించి, అమలవుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ దవాఖానలో గర్భిణులకు అందిస్తున్న సేవలను వైద్య సిబ్బందికి అధికారులకు వివరించారు. పర్యటించిన వారిలో కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ట్రెయినీ అధికారులు అర్చనబోరియ, రాణి కుమారి, సీమ రాణి, రాహుల్ కుమార్ మీనా, అఖిమ్ రాజ్ రంజన్ ఉన్నారు. వీరి వెంట ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో సాయిలు, సర్పంచ్ గంగామణీప్రసాద్, జీపీ కార్యదర్శి గంగారాం, సిబ్బంది ఉన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

కమ్మర్‌పల్లి: మండ కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తమ జ్ఞాపకాలను తోటి మిత్రులతో పంచుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

పసిడి పంటకు వర్షం దెబ్బ

- పరేషాన్‌లో పసుపు రైతు..!
- అధిక వర్షాలతో తెగుళ్లు

బాల్కొండ: పసుపు సాగును పసిడితో పోలుస్తారు. పసిడి ధర పెరిగితే పసుపు ధర పెరగుతుందని రైతుల నమ్మకం. అలాంటి పంటపై రైతుల ఆశలపై సన్నగిల్లుతున్నాయి. ప్రస్తుతం అధిక వర్షాలతో పసుపు పంటకు అధిక తెగుళ్లు సోకడంతో పసుపు రైతు పరేషాన్ అవుతున్నాడు. పంటకు తేమ శాతం అధికమైతే పంటకు వేరుకుళ్లు, దుంపకుళ్లు అధికంగా సోకుతుంది. జిల్లాలో 33 వేల ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేస్తున్నారు. జూలైలో నిరంతరం పదిహేను రోజులు వర్షాలు కురిశాయి. ప్రస్తుతం వారం రోజుల పాటు వర్షాలు కురుస్తుండడంతో పంట దెబ్బతింటోంది. దీంతో పసుపు పంటపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రస్తుతం పసుపు కొమ్ము వేసే దశలో ఉంది. ఈ సమయంలో వర్షాలు కురిస్తే పంటపై ఆశలు వదులు కోవాల్సిందే.

ఇతర పంటలపై ప్రభావం

పసుపుతో పాటు మక్క, సోయా పంటలపై ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ప్రభావం చూపుతాయని రైతులు పేర్కొంటున్నారు. సోయా పంట



ముందస్తుగా సాగు చేసిన పంట మరో నాలుగు రోజుల్లో కోతకు వస్తుంది. వర్షాలు కురిస్తే పంట నిలువుగానే మొలకెత్తే ప్రమాదం ఉంది. మక్క చివరి దశలో వేసిన పంటపై వర్షం దిగుబడి ప్రభావం చూపుతోంది. ముందస్తుగా సాగు చేసిన పంటలు కోత దశలో ఉన్నాయి. వాటిని ఆరబెట్టడానికి తిప్పలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దుంపకుళ్లు సోకుతుంది



వర్షాలు ఎక్కువగా కురిస్తే పసుపు పంటకు దుంపకుళ్లు సోకుతుంది. జూలైలో కురిసిన అధిక వర్షాలతో పంటలో ఇప్పటికి ఎదుగుదల లేకుండా పోయింది. మళ్లీ వర్షాలు కురిస్తే పసుపు పంటపై ఆశలు లేకుండ పోతాయి. – లక్ష్మణ్, రైతు, రెంజర్ల

వర్షాలు ఆగం చేస్తున్నయి



అకాల వర్షాలతో రైతులం ఆగమవుతున్నాం. ప్రస్తుత భారీ వర్షాలకు అన్ని పంటలకు నష్టమే. సోయా పంట కూడా ప్రమాదం ఉంది. నష్టపోయినన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. – సతీశ్, రైతు, నాగంపేట్

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం



భిక్కనూరు: ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాగట్లపల్లి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం తీర్మానించారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ హామీని నెరవేర్చలేకపోవడం శోచనీయమన్నారు. తీర్మాన ప్రతిని రెడ్డి సంఘం రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ నాగార్తి చంద్రారెడ్డికి అందజేశారు.

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ నజర్

- నిజాంసాగర్, జుక్కల్‌లో దాడులు
- రూ. 90 వేల నగదు, వాహనాలు స్వాధీనం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలో కొనసాగు తున్న పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నజర్ పెట్టారు. రాష్ట్ర సరిహద్దు గ్రామాలు, అటవీ ప్రాంతాలు, నివాసాలు, దాబా హోటళ్లలో కొనసాగుతున్న పేకాట స్థావరాలపై ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తున్నారు. శనివారం సాయంత్రం నిజాంసాగర్, జుక్కల్ మండలాల్లోని పేకాట స్థావరాలపై జిల్లా ఎస్పీ సీఐ సంతోష్, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేశారు. మండలంలోని మంగ్లూర్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకోగా కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ. 41 వేల నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఓ వ్యాపారి ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్పీ సీఐ సంతోష్, స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 49 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

బీఆర్ఎస్, బీజేపీలు భూస్థాపితమవడం ఖాయం

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



భిక్కనూరు: ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని, ఆ రెండు పార్టీల నేతలు ప్రజలను ప్రలోభాలకు గురిచేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆ రెండు పార్టీలను భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా నియమితులైన షబ్బీర్‌అలీని భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు తనను పార్టీ హైకమాండ్ పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా నియమించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, పట్టణాధ్యక్షుడు అందె దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి సమీపంలోని రంగంపేట – అడ్లూర్ గ్రామాల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 10 గంటల ప్రాంతంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు రైల్వే ఎస్సై తావూ నాయక్ తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గొర్రెల కాపరి..


మధు మృతదేహం

భిక్కనూరు: మండలంలోని పెద్ద మల్లారెడ్డిలో గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన తుప్పాతుల మధు (24)కు నెల రోజుల క్రితం భార్యతో విడాకులు అయ్యాయి. నాటి నుంచి బాధపడుతున్న మధు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో పేకాట ఆడుతున్న నలుగురికి అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఏసీపీ రాజశేఖర్‌రాజు ఆదేశాల మేరకు పేకాటస్థావరంపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకోగా మరో ఇద్దరు పరారయ్యారని వీరి నుంచి రూ.1,35,160 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

నిజామాబాద్‌నాగారం: జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేటి నుంచి నిరవధికంగా సమ్మె చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు స్వర్ణలత, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి


మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు


కేతావత్ గంగారాం (ఫైల్)

వర్ని: ఆటోను బియ్యం లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్రగాయాలైనట్లు రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై నరేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని పరిధిలోని బెల్యానాయక్ తండా శివారులో తండాకు చెందిన కేతావత్ గంగారాం తన కుటుంబంతో కలిసి ఆదివారం మక్క కంకులను విక్రయిస్తోంది. వీరి ఎదుట ఆటోలో వచ్చిన వారు కంకులను కొనుగోలు చేస్తుండగా బాన్సువాడ నుంచి అతివేగంగా వస్తున్న బియ్యం లారీ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గంగారాం (45) మృతి చెందగా కూతురు బూలి, ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పోలీస్‌స్టేషన్, రహదారిపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. లారీ నిర్వాహకుడు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించినట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కారును ఢీకొన్న ఘటనలో ఒకరు


లింగారెడ్డి(ఫైల్)

దోమకొండ: కారును లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిటన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం జప్తి శివనూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంబారిపేటకు చెందిన సరికొండ లింగారెడ్డి(50) బంధువులతో కలిసి శుభకార్యం నిమిత్తం కారులో వెళ్తుండగా జప్తిశివనూరు శివారులో వీరి కారును వెనుకనుంచి లారీని ఢీకొన్నది. ఈ ఘటనలో లింగారెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు.

పరిస్థితి విషమించి మరొకరు..

బాన్సువాడ: బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన కల్లు రాములు(36) నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 2న రాములు పశువుల గడ్డి కోసం పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటువేసింది. వెంటనే బాన్సువాడ ఆస్పత్రికి వెళ్లగా వైద్యుల సలహా మేరకు నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చద్మల్‌లో బాలిక..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని చద్మల్ గ్రామానికి చెందిన ఎర్రం నందిని(16) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. రెండు రోజుల క్రితం నందినికి చాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నందిని ఆదివారం మృతి చెందింది. బాలిక తండ్రి ఎర్రం సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బైపాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిపేట మండలం వన్నెల్(కె) గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వస్తున్న ఐషర్ వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో కారులో ఉన్న భాస్కర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న ఘటనలో..



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయలైనట్లు ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కట్ట రామ్మోహన్ భార్య కృష్ణవేణి, స్నేహితుడు కృష్ణారావు భార్య అనురాధ కారులో నిజామాబాద్‌లో జరిగిన పెళ్లికి తిరిగి వస్తుండగా జంగంపల్లి కృష్ణమందిర్ సమీపంలో కారును లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని కామారెడ్డి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.